

## పార్వేట పల్లకీకి స్వాగతం

రుద్రవరం: అహోబిలేశుని పార్వేట పల్లకీ గురువారం ఆర్. నాగులవరానికి చేరుకుంది. గ్రామస్తులు మేళతాళలతో ఎదురేగి వెళ్లి పూజలు నిర్వహించి గ్రామంలోకి స్వాగతించారు.



## పాత్రలు విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన జి. పర్వతయ్య, వివిన్ డ్రగ్స్ అండ్ ఫార్మసిస్టికల్ లిమిటెడ్ వారు రూ. 3 లక్షల విలువ చేసే పాత్రలను అందజేశారు.



## శ్రీగిరికి స్వయం ప్రతిపత్తి

టీటీడీ తరహాలో శ్రీశైలానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు గురువారం తీర్మానించింది. ఈ మేరకు దేవదాయ శాఖకు ప్రతిపాదించారు.

IIలో▸

## న్యూస్‌రీల్

### సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలి

- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

ప్యాపిలి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు తమ పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి వాటి వివరాలను ఏఎస్‌ఐ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నేరాల దర్యాప్తు విషయంలో వృత్తి నైపుణ్యతతో పాటు శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరస్థులను అరెస్టు చేయాలన్నారు. ఎన్నికల వేళ అన్ని గ్రామాలపై పోలీసులు నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్పీ వెంట డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

### వైద్య రంగానికి పెద్దపీట

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం నాడు- నేడు కార్యక్రమం ద్వారా వైద్య రంగానికి పెద్దపీట వేసిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ఓపీ విభాగం, ల్యాబ్, కాన్పుల వార్డు, మందుల గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రజలు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మాతా శిశు మరణాల రేటును తగ్గించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం మండలంలోని చిన్నకొప్పెర్ల వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### డీసీసీబీ నూతన సీఈఓగా విజయకుమార్

- వ్యక్తిగత సెలవుల్లో ప్రస్తుత సీఈఓ శివలీల

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తాత్కాలిక ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఎం.విజయకుమార్‌ను నియమిస్తూ పాలక వర్గం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఆప్కాబ్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి అధికారి. దాదాపు ఏడాదిన్నర నుంచి డీసీసీబీలో జనరల్ మేనేజర్/ ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలాఉంటే ఈ నెల 7న సీఈఓగా శివలీల బాధ్యతలు చేపట్టారు. అయితే వ్యక్తిగత పనులపై 45 రోజుల దీర్ఘకాలిక సెలవులో అమెరికా వెళ్తుండటంతో పాలక వర్గం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్‌కు సీఈఓ బాధ్యతలు అప్పగించారు. శివలీల శుక్రవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉండగా.. ఆ వెంటనే విజయకుమార్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

### నలుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు (టౌన్): వైఎస్సార్, నంద్యాల జిల్లాలకు చెందిన నలుగురు పోలీసు సిబ్బందిపై ఉన్న సస్పెండ్‌ను ఎత్తివేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కడపకు చెందిన ఇన్‌స్పెక్టర్ పి. శేషయ్య, నంద్యాలకు చెందిన ఎస్‌ఐ బి.నాగరాజు, కడపకు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి. బాలదస్తగిరి, ఆఫీసు సూపరింటెండెంట్ టి. ప్రశాంతిపై సస్పెండ్‌ను ఎత్తివేస్తూ విధుల్లోకి చేరాలని సూచించారు.

# సహకారం.. నూతనోత్సాహం

**ప్రభుత్వ చర్యలతో వృద్ధిలోకి సహకార సంఘాలు**

- టీడీపీ హయాంలో 90 సంఘాలకు నష్టాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 70 సంఘాలకు స్పష్టమైన లాభాలు
- కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌ల అభివృద్ధి
- మల్టీపర్పస్ గోదాములు, కమ్యూనిటీ సెంటర్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ
- సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు
- ఆప్కాబ్, డీసీసీబీ చొరవతో మారిన రూపురేఖలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఐదేళ్ల క్రితం చూసిన సంఘాలను ఇప్పుడు చూస్తే ఇంతలా అభివృద్ధి చెందాయా అనుకోక తప్పదు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి, ఇందులో సభ్యులుగా ఉన్న పీఏసీఎస్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. నాడు నష్టాల్లో మునిగితేలుతున్న సహకార సంఘాలను లాభాల బాట పట్టించడం ద్వారా రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించే స్థాయికి చేర్చడం విశేషం. 2014–15 నుంచి 2018–19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల సహకార సంఘాలు ఉండీ లేనట్లుగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు(ఆప్కాబ్), జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సంయుక్తంగా సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి లాభాల బాట పట్టించాయి. ఇందుకు నాబార్డు కూడా అన్నివిధాల సహకరిస్తోంది. గతంలో సహకార సంఘాలు కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడం వరకే పరిమితం. కానీ నేడు సహకార సంఘాల రూపురేఖలను ప్రభుత్వం సమూలంగా మార్చేస్తోంది.

**ఫ్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ ఏర్పాటు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఫ్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ ప్రత్యేకంగా ఏర్పాటైంది. దీనికి ఆప్కాబ్‌కు చెందిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఫ్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ పీఏసీఎస్‌లకు ఏ వ్యాపారాల్లో అభిరుచి ఉందో తెలుసుకుంటుంది. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఆప్కాబ్‌కు, నాబార్డుకు పంపి నిధుల మంజూరుకు కృషి చేస్తోంది.

**పూర్తి కావచ్చిన కంప్యూటరీకరణ**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార సంఘాల కంప్యూటరీకరణ ముమ్మరంగా సాగుతోంది. మొత్తం 99 సంఘాలు ఉండగా.. ఈ నెల చివరిలోపు కంప్యూటరీకరణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో లావాదేవీలను చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. కంప్యూటరీకరణ పూర్తయితే పీఏసీఎస్‌లు మినీ బ్యాంకులుగా మార్పు చెందనున్నాయి.



నంద్యాల జిల్లా పోలూరు పీఏసీఎస్ నూతన భవనం

**1.54 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములు**

పీఏసీఎస్‌లకు అనుబంధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 232 మల్టీపర్పస్ గోదాములు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గోదాముల సామర్థ్యం 1.54 లక్షల మెట్రిక్ టన్నులు ఉండటం విశేషం. కర్నూలు జిల్లాలో దాదాపు రూ.60 కోట్ల వ్యయంతో 99 గోదాములు.. నంద్యాల జిల్లాలో రూ.80 కోట్లతో 133 గోదాములు నిర్మిస్తున్నారు. పూర్తి చేసిన గోదాములను మార్కెటింగ్ శాఖ పీఏసీఎస్‌లకు అప్పగిస్తోంది.



జన ఔషధి కేంద్రం

**సహకార సంఘాల్లో జన ఔషధి కేంద్రాలు**

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. మొదటి విడత సి.బెళగల్, హొళగుంద, ఓర్వకల్, కౌతాళం, పెద్దకడుబూరు, మద్దికెర, మదిర పీఏసీఎస్‌లతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, దొర్నిపాడు మండలంలోని గుండుపాపల, నంద్యాల మండలంలోని పోలూరు, ఆళ్లగడ్డ, కొత్తపల్లి మండలంలోని నాగంపల్లి సహకార సంఘాల్లో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. మరిన్ని సొసైటీలు జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి.

**సహకార సంఘాల్లో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి**

| జరిగిన అభివృద్ధి | సంఘాలు | నిధుల వినియోగం (రూ.కోట్లలో) |
|---|---|---|
| పెట్రోల్ బంకులు | 2 | 1.19 |
| షాపింగ్ కాంప్లెక్స్‌లు | 8 | 1.41 |
| కొత్త ఆఫీసు భవనాలు | 11 | 1.65 |
| ఫంక్షన్‌హాల్/కమ్యూనిటీ హాల్స్ | 2 | 1.23 |
| గోదాముల పునరుద్ధరణ | 7 | 1.36 |
| పీవీసీ లింక్ పైప్స్ వ్యాపారం | 1 | 0.19 |
| రైస్ బ్యాగ్స్ వ్యాపారం | 1 | 0.23 |
| పర్సనల్ లోన్స్ | 6 | 3.60 |
| గోల్డ్ లోన్స్ | 6 | 3.06 |
| టార్పాలిన్ వ్యాపారం | 1 | 0.18 |
| టూ వీలర్ వెహికల్స్ | 5 | 2.03 |
| గోనె సంచుల వ్యాపారం | 5 | 0.36 |
| ఇతర వ్యాపారాలు | 2 | 0.02 |
| మల్టీపర్పస్ గోదాములు | 99 | 140.00 |
| పీఎం జన ఔషధి కేంద్రాలు | 16 | --- |
| మొత్తం | | 156.51 |



సహకార సంఘంలో ఏర్పాటైన పెట్రోల్ బంకు



సి.బెళగల్ పీఏసీఎస్ నూతన భవనం

**నాడు..**

14 ఏళ్ల సీఎంగా కొనసాగిన చంద్రబాబు తన పాలనలో సహకార రంగం అభివృద్ధికి కనీస చొరవ చూపలేకపోయారు. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలన్నీ దాదాపుగా నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విషయంలోనూ వెన్నుపోటుకు పాల్పడ్డారు. అక్రమంగా ఆమెను తప్పించి అనుయాయులకు పట్టం కట్టడం ఆ పార్టీ నీచ సంస్కృతికి అద్దం పట్టింది.

**నేడు..**

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు తరహాలో సహకార సంఘాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం విశేషం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. ఆప్కాబ్, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక సహకారంతో దాదాపు రూ.18 కోట్లతో సహకార సంఘాలు అభివృద్ధి బాట పట్టాయి. కంప్యూటరీకరణతో త్వరలోనే బ్యాంకు సేవలను కూడా అందించనుండటం మార్పునకు నిదర్శనం.

**బహుళసేవా సంస్థలుగా పీఏసీఎస్‌లు**

- 11 పీఏసీఎస్‌లకు నూతన భవనాలు నిర్మించారు.
- బంగారు ఆభరణాలు నిల్వ చేసుకునేందుకు వీలుగా స్ట్రాంగ్ రూములు.
- రెండు సహకార సంఘాలలో పెట్రోల్ బంకులు.
- పలు సంఘాలకు కమర్షియల్ షాంపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్స్, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గోదాములు.
- ఆధునీకరణ, మరమ్మతులు, మొబైల్ రైస్ మిల్, లారీ వేబ్రిడ్జి ప్లాట్‌ఫామ్, టెంట్‌హౌస్, సూపర్ బజార్ల ఏర్పాటు.
- బాంగారం ఆభరణాలపై రుణాలు.
- పీఏసీఎస్‌లు బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లుగా కూడా అభివృద్ధి.

**అభివృద్ధి పథంలో పీఏసీఎస్‌లు**



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు క్రమంగా లాభాల్లోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు దాదాపు రూ.17 కోట్లతో సంఘాలను అభివృద్ధి చేశాం. రూ.140 కోట్లతో మల్టీపర్పస్ గోదాములు కూడా నిర్మిస్తున్నాం. సంఘాలు వ్యాపారాలను విస్తరించుకోవడం వల్ల లాభాల బాట పడుతున్నాయి. సొసైటీలను మల్టీపర్పస్ సెంటర్లుగా, కామన్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

– వహిదా సుల్తానా, మేనేజర్, జిల్లా ఫ్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్

# మేలు జరిగితేనే ఓటేయమన్న ఏకైక సీఎం జగన్



మహిళా రైతుకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ప్రజల ఆశీర్వాదంతో 2024లో వైఎస్సార్‌సీపీదే విజయం
- బేతంచెర్ల మొదటి విడతగా కృష్ణా జలాలు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: దేశ రాజకీయాల్లో ఇప్పటి వరకు మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటేయమని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్రతి పక్షాలు అన్ని ఏకమైనా ప్రజల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం బేతంచెర్ల పట్టణానికి సమీపంలో కొలుములపల్లె రహదారిలో రూ.60 లక్షలతో మార్కెట్ యార్డ్ నిర్మాణానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మండలంలోని ముద్దవరం, ఎం.పెండేకల్లు, ఆర్‌ఎస్ రంగాపురం, కొలుములపల్లె, గూటుపల్లె, ఎంబాయి, ఆర్.కొత్తపల్లి, గోర్లగుట్ట, బేతంచెర్ల, బుగ్గానిపల్లె గ్రామాల రైతులకు సంపూర్ణ భూహక్కు పత్రాలను ఆర్థిక మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 351 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం నుంచి మొదటి విడతలో అనుకున్న విధంగా బేతంచెర్ల పట్టణానికి గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఈనెల 24వ తేదీన కృష్ణాజలాలు అందిస్తామన్నారు. డోన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. ఐదేళ్ల జగనన్న పాలనలో బేతంచెర్లలో 3 వేల కుటుంబాలకు జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం కింద సంపూర్ణ భూ హక్కులు, అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చి రూ. 470 కోట్ల మేర లబ్ధి చేకూర్చామన్నారు. పారదర్శకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు మేలు చేశామన్నారు.



మార్కెట్ యార్డ్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

**అబద్ధాల చంద్రబాబును నమ్మొద్దు**

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ అంటూ ఊర్లు తిరుగుతున్న అబద్ధాల మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. 2014 ఎన్నికల్లో మహాలక్ష్మీ పథకం కింద పుట్టిన ప్రతి ఆడ పిల్లకు రూ. 25 వేలు ఇస్తామని, ప్రతి పేదవాడికి 3 సెంట్ల స్థలంలో ఇంటి పట్టా ఇస్తామని ఇవ్వకుండా ప్రజలను వంచించారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ కూడా ఉత్తి గ్యాస్ మాటలుగా మారాయన్నారు. డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ చేస్తామని పొదుపు మహిళలను నట్టేట ముంచారన్నారు. తనపై విమర్శలు చేసే డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ముందు టికెట్ వస్తుందో లేదో చూసుకోవాలని ఎద్దేవా చేశారు. తాగునీటి పథకాలు, సాగునీటి కాల్వలు, రహదారులు, విద్యాలయాలు, ఉపాధి శిక్షణ కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు, అతిథి గృహాలు, పర్యాటక ప్రాంతాలు.. ఇవన్నీ అభివృద్ధి కాదా అని మంత్రి ప్రశ్నించారు. మరింత మెరుగైన సంక్షేమ పథకాలు, సమర్థవంతమైన పాలన కోసం వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు ముర్తుజావలి, ఖాజా, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, వార్డు కౌన్సిలర్స్ మధు, శకుంతల, ఇబ్రహీమ్ పాల్గొన్నారు.

# కౌలు రైతులకు విరివిగా రుణాలు అందించండి

- ఖరీఫ్ పంట రుణాలను రీ షెడ్యూల్ చేయండి
- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు





బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శ్రీనివాసులు, ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

నంద్యాల: వ్యవసాయం, పాడి, పరిశ్రమ ఇతర ఉపాధి రంగాలపై ఆధారపడి జీవిస్తూ అర్హులైన వారందరితో పాటు కౌలు రైతులకు విరివిగా అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ కె.నరసింహారావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీఓ నాగప్రవీణ్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ టీవీ రమణ, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ, పాడి పరిశ్రమ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీసీ కార్డులు మంజూరు చేసిన 22,740 మంది కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని బ్యాంకర్లను సూచించారు. కరువు మండలాలుగా ప్రకటించిన పాణ్యం, బనగానపల్లె, గడివేముల, మిడుతూరు, పగిడ్యాల, బేతంచర్ల మండలాల్లో ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలను రిజర్వ్ బ్యాంక్ నిబంధనల మేరకు రీ షెడ్యూల్ చేయాలన్నారు. జగనన్న బడుగు వికాసం కింద చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల యూనిట్లకు రుణాలందించి యువ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి ఉపాధి కల్పనకు తోడ్పాటును అందించాలన్నారు. ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా అవగాహన క్యాంపులు నిర్వహించాలన్నారు.

- నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ అన్ని వనరులు ఉన్న నంద్యాల ప్రాంతంలో పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు సబ్సిడీ లింక్ రుణాల అందించేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ పొదుపు లక్ష్మి మహిళలు తమ భర్తలు తీసుకున్న పంట రుణాలను లింక్ చేస్తూ బ్యాంకర్లు బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయడం లేదంటున్నారని, ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆర్ఓఎఫ్‌ఆర్ కింద పట్టాలిచ్చిన రైతులకు కూడా క్షేత్ర స్థాయిలో రుణాలు ఇవ్వాలన్నారు.
- లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ 2023–24 వార్షిక రుణ ప్రణాళిక అమలులో డిసెంబర్ 31 నాటికి 93 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఈ రుణ ప్రణాళికలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక ఇతర ఉపాధి రంగాలకు మంజూరు చేసిన రుణ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

### వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్‌సీపీ పరిశీలకులను పార్టీ అధిష్టానం నియమించింది. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పాణ్యం నియోజకవర్గానికి మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ పీపీ నాగిరెడ్డిని నియమించింది. కర్నూలు నియోజకవర్గానికి కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆలూరు నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, ఎమ్మిగనూరుకు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. శ్రీశైలం నియోజకవర్గానికి మైనార్టీ శాఖ రాష్ట్ర సలహాదారు హబీబుల్లా, బనగానపల్లె నియోజకవర్గానికి చాగలమర్రికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత షేక్‌బాబూలాల్‌ను పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించింది. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# ‘అఖిలప్రియ మా స్థలాన్ని కబ్జా చేశారు’

- అధికారులు న్యాయం చేయకపోతే ఆమరణ దీక్ష
- బాధితుడు డాక్టర్ సురేంద్ర

ఆళ్లగడ్డ: మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తమ స్థలాన్ని కబ్జా చేశారని బాధితుడు డాక్టర్ సురేంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న 369/1 సర్వే నంబర్‌లో సుమారు వంద ఇళ్లకు ఉన్న రస్తాను అఖిలప్రియ కబ్జా చేసి అందులో ప్లాట్లు వేశారన్నారు. ఆమెకు 369 సర్వే నంబరులో 660 గజాలు 194 అడుగుల వెడల్పుతో హక్కు ఉందని, అయితే అది కాదని సుమారు 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించి అప్రువర్ లేఅవుట్‌లలోకి దౌర్జన్యంగా వచ్చి రాళ్లు పాతుకుని ప్లాట్లు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. ఈ విషయంపై స్థానిక మున్సిపల్ అధికారుల ఫిర్యాదు చేస్తే రెవెన్యూ కార్యాలయం సర్వేయర్‌ను కొలతలు వేయాలని ఆదేశించారన్నారు. అయితే అఖిలప్రియ వేసిన ప్లాట్లలో సర్వేయర్ తన బావమరిది పేరుమీద ఒక ప్లాట్ కొనుగోలు చేయడంతో ఎన్నిసార్లు వెళ్లి ప్రాధేయపడినా కొలతలకు రావడం లేదన్నారు. అన్ని శాఖల అధికారులు ఆమెకు భయపడి చర్యలు తీసుకోలేక పోతున్నారన్నారన్నారు. తన సమస్య పరిష్కరించకపోతే సోమవారం నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని బాధితుడు సురేంద్రారెడ్డి తెలిపారు.



కబ్జాకు గురైందని చెబుతున్న స్థలం ఇదే

## మద్దతు ఇవ్వలేదు.. కబ్జా నుంచి కాపాడారు!

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెర్వు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు ఇవ్వలేదు. కబ్జా నుంచి స్థలాన్ని కాపాడారు. అయితే ఈనాడు దినపత్రికలో అందుకు విరుద్ధంగా గురువారం వార్త ప్రచురితం కావడంపై అధికార పార్టీనాయకులు మండిపడుతున్నారు. కొట్టాలచెర్వు గ్రామంలో చెంచులకు నూతన పాఠశాల, వసతి గృహ నిర్మాణం కోసం రూ.2.30 కోట్లు మంజూరు కాగా.. స్థల సేకరణ కోసం గ్రామంలో ప్ర భుత్వ స్థలాలను పరిశీలించారు. అందుకు అనువైన 12 సెంట్ల స్థలాన్ని తులసీబాయి అనే మహిళ అప్పటికే ఆక్రమించుకుని పశుగ్రాసం, పశువుల షెడ్ వేసుకుని ఉంది. ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్ నాగలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్డా దేవదానం, రమణ, చిన్నా తదితరులు తహసీల్దార్ బాబుకు తెలిపారు. కబ్జా నుంచి ఆ స్థలాన్ని విడిపించి, వసతి గృహం నిర్మాణానికి కేటాయించాలని కోరారు. వారి విన్నపం మేరకు తహసీల్దార్ బాబు, ఎస్‌ఐ నారాయణరెడ్డి గ్రామానికి వచ్చి స్థల పరిశీలన జరిపారు. తులసీబాయి ఆ స్థలానికి సంబంధించి తనకు హక్కులున్నాయని రికార్డులు చూపగా అవి చెల్లవని తెలిపిన అధికారులు తదుపరి చర్యల కోసం నోటీసులు ఇచ్చారు.

## వైఎస్‌ఆర్ జలకళ బోర్ల తవ్వకం పారదర్శకమే..

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ జలకళ కింద నంద్యాల జిల్లాలో వేసిన బోర్ల తవ్వకాలు పారదర్శకంగా జరిగినట్లు సామాజిక తనిఖీల ద్వారా స్పష్టమైంది. గురువారం నంద్యాల జిల్లాలో వైఎస్సార్ జలకళ బోర్ల తవ్వకాలు, కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని వాటర్‌షెడ్ కార్యక్రమాలపై కర్నూలు శివారు జగన్నాథగట్టులోని జిల్లా నీటియాజమాన్య సంస్థ శిక్షణా కేంద్రంలో ఓపెన్‌ఫోరం నిర్వహించారు. కర్నూలు జిల్లా డ్వామా పీడీ అమరనాథరెడ్డి, నంద్యాల డ్వామా పీడీ రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ముందుగా సామాజిక తనిఖీ బృందాల పరిశీలనలో వెలుగు చూసిన అంశాలను అధికారుల దృష్టికి తెచ్చారు. నంద్యాల జిల్లాలో మొత్తం 2,138 బోర్లు వేయగా.. 2022 జూలై 1 నుంచి 2022 ఫిబ్రవరి 22 వరకు వేసిన బోర్లలో పూర్తి పేమెంట్ అయిన వాటికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. మొత్తం 675 బోర్లపై సామాజిక తనిఖీలు నిర్వహించగా 5 శాతం బోర్ల తవ్వకాల లోతుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని బోర్లలో రికార్డు చేసిన దాని కంటే 20-30 అడుగుల లోతు తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. అయితే ఓపెన్ ఫోరంకు హాజరైన రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో రికార్డు చేసిన మేరకు బోర్లు వేశారని, అయితే పూడిపోవడం వల్ల తేడాలు వచ్చాయన్నారు. అనంతరం కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని శకునాల, పోతుగల్ పీఎంకేఎస్‌వై వాటర్‌షెడ్ పనులపైనా ఓపెన్ ఫోరం నిర్వహించారు.

# శ్రీగిరికి స్వయం ప్రతిపత్తి

- దేవదాయ శాఖకు ప్రతిపాదన
- రూ.4.90 కోట్లతో కర్నూలులో దేవస్థాన కల్యాణ మండపం
- దేవస్థానం ట్రస్టుబోర్డులో సభ్యుల తీర్మానం



ధర్మకర్తల మండలి సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, ఈఓ పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల దేవస్థానానికి కూడా స్వయం ప్రతిపత్తి కల్పించాలని దేవదాయ శాఖకు ప్రతిపాదన పంపాలని ట్రస్టు బోర్డులో తీర్మానించినట్లు దేవస్థానం ధర్మకర్త మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. గురువారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్ష మందిరంలో ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన ధర్మకర్త మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 50 అంశాలు చర్చించగా 49 అంశాలను ఆమోదించారు. ఒక అంశాన్ని వాయిదా వేశా రు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహా కుంభాభిషేకాన్ని విజయవంతంగా నిర్వహించిన దేవస్థాన ఈఓ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ముందుగా ఇటీవల దేవస్థానం వేద పండితులు జగన్నాథ శర్మ మృతి పట్ల సభ్యులు సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. ఈ సమావేశంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరుపాక్షయ్య స్వామి, సుజాతమ్మ, నరసింహారెడ్డి, విజయలక్ష్మి, మురళి, హనుమంతు నాయక్, మధుసూదన్ రెడ్డి, మాధవీలత, ధర్మరాజు, జగదీశ్వర్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రమణమ్మ, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**ఆమోదించిన ముఖ్యమైన ప్రతిపాదనలు..**

- రూ.19 కోట్ల అంచనా వ్యయంతో శ్రీశైలంలో స్థానికులు, యాత్రికుల సౌకర్యార్థం 30 పడకల వైద్యశాల నిర్మాణానికి ట్రస్టు బోర్డు ఆమోదం తెలిపింది.
- రూ.36 లక్షల అంచనా వ్యయంతో దేవస్థాన గోసంరక్షణ శాలలో రక్షణ కంచె ఏర్పాటు, అవసరమైన చోట షెడ్డు ఏర్పాటు, సిమెంటు కాంక్రీట్ రోడ్డు, విభూతి తయారీ షెడ్డుకు అవసరమైన మరమ్మతుల కోసం ఆమోదం తెలిపారు.
- రూ.4.90 కోట్లతో కర్నూలులోని దేవస్థానం సమాచార కేంద్రం వద్ద కల్యాణ మండపం నిర్మాణం.
- రూ.3.70 కోట్లతో కర్నూలులోని సమాచార కేంద్రం వద్ద వాణిజ్య సముదాయం .
- సున్నిపెంటలో నిర్మిస్తున్న సిబ్బంది వసతి గృహాలకు నీటి సరఫరాకు రూ.15 కోట్లు.
- మల్లికార్జున సదన్ అతిథిగృహంలో మరమ్మతు పనులు, అభివృద్ధికి రూ.9.50 లక్షలు.
- రూ.39.90 లక్షల వ్యయంతో దేవస్థానం అవసరాల మేరకు వేసవి కాలం, శ్రావణ మాసం, గణపతి నవరాత్రులు, దసరా మహోత్సవాలు, కార్తీక మాసం, మొదలైన సందర్భాలలో షామియానాలు, గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు
- రూ.15 లక్షల అంచనా వ్యయంతో క్షేత్ర పరిధిలో పలు చోట్ల చెత్తకుండీల ఏర్పాటుకు ఆమోదం
- రూ.6.50 లక్షల వ్యయంతో సిద్ధరామేశ్వర పాదాల పరిసర ప్రాంతాల్లో జల్లు స్నానానికి ప్లాట్‌ఫాం నిర్మాణం
- క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా ఎస్‌ఈ పోస్టు ఏర్పాటుకు దేవదాయ శాఖకు ప్రతిపాదనలు పంపాలని తీర్మానం.

# తెల్లదొరల పాలిట సింహ స్వప్నం



ఉయ్యాలవాడలో నరసింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల

ఉయ్యాలవాడ: స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తెల్లదొరల పాలిట సింహస్వప్నంగా నిలిచారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. గురవారం నరసింహారెడ్డి 177వ వర్ధంతి సందర్భంగా ఉయ్యాలవాడలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారి కబంధ హస్తాల నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు నరసింహారెడ్డి చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. అలాగే ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నంద్యాల డివిజన్ అధ్యక్షుడు అమీర్, కోశాధికారి సుబ్రమణ్యం,బీసీఎస్సార్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి విద్యార్థులతో ర్యాలీగా వచ్చి నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# జీవనోపాధి మెరుగు పర్చుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): స్వయం సహాయక సంఘాల సభ్యులు స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి మెరుగు పర్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని డ్వామా సమావేశ భవనంలో జిల్లా మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో స్త్రీ నిధి రుణాల లక్ష్యం రూ.147 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.101 కోట్ల 18,102 మంది సభ్యులకు మంజూరు చేశామన్నారు. మిగిలిన రూ. 46 కోట్ల మొత్తాన్ని మార్చి 24వ తేదీలోగా స్వయం సంఘాల మహిళలకు రుణాలు ఇచ్చేందుకు కసరత్తు పూర్తి చేశామన్నారు. సీఐఎఫ్ నిధులు, స్త్రీనిధి, ఉన్నతి నిధులు అర్హులైన పేద కుటుంబాల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఎంతో దోహదపడుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు ఫేస్-9లో నంద్యాల జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 9,359 మందికి రుణాలు ఇప్పించామన్నారు. జిల్లాలో 32 వేల సంఘాలన్నీ ఏగ్రేడ్‌లో ఉన్నాయని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.810 కోట్ల బడ్జెట్‌కు గాను ఇప్పటి వరకు రూ.1,059 కోట్లు బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించామని వివరించారు. సమావేశంలో డీపీఎం ఐబీ దర్శనం, దానం, ప్రాజెక్టు మేనేజర్ దేగలయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షులు మార్తమ్మ, కోశాధికారి హేమలత, బ్యాంకు లింకేజీ కో ఆర్డినేటర్ ఎల్లయ్య, వైఎస్సార్ చేయూత ఏపీఎం శీను, ప్రకృతి వ్యవసాయం డీపీఎం అబ్దుల్‌సలాం, తదితరులు పాల్గొన్నారు.

## యాగంటిపల్లె కేవీకేకు ఉత్తమ అగ్రి ఫిల్మ్‌ఫెస్టివల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీకే ధనలక్ష్మి

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రాని (కేవీకే)కి ఉత్తమ అగ్రి ఫిల్మ్‌ఫెస్టివల్ అవార్డు లభించింది. కేవీకే గత పదేళ్ల నుంచి వివిధ రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే కంది, కొర్ర, జొన్న, శనగ వంటి వంగడాలను రైతులకు పరిచయం చేసి మంచి దిగుబడులను సాధించింది. ఈ పరిశోధన ఫలితాలను చిత్రీకరించి శుక్రవారం హైదరాబాద్‌లో జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ వారు నిర్వహించిన ప్రదర్శనలో ఉత్తమ అగ్రి ఫిల్మ్‌ఫెస్టివల్ అవార్డు లభించింది. ఈ మేరకు మెమొంటో ప్రశంసా పత్రం అందుకున్నట్లు ధనలక్ష్మి తెలిపారు.

## కోరిక తీరిస్తే.. సెల్ కొనిస్తా!

- ఆలస్యంగా వెలుగు చూసిన టీడీపీ నాయకుని భాగోతం
- కేసు నమోదు, పరారీలో నిందితుడు



టీడీపీ నేత మాండ్ర శివానందరెడ్డితో నిందితుడు హేమసుందర్‌రాజు (మధ్యలో కళ్లద్దాలు ఉన్న వ్యక్తి) ఫైల్

పగిద్యాల: కోరిక తీరిస్తే సెల్ కొనిస్తానంటూ ఓ మహిళను లైంగికంగా వేధించిన టీడీపీ నాయకుని భాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. ముచ్చుమర్రి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ముఖ్య అనుచరుడైన నెహ్రూనగర్‌కు చెందిన హేమసుందర్‌రాజు ఈనెల 14వ తేదీన గ్రామానికి చెందిన ఓ పేద మహిళను ఇంట్లో పనిచేయడానికి రావాలని పిలిచాడు. దీంతో ఆమె ఒంటరిగా వెళ్లకుండా తన అత్త కూతురును వెంట బెట్టుకుని వెళ్లింది. ఆమె ఇంటిని శుభ్రం చేసే పనిలో నిమగ్నం కాగా ముద్దు ఇవ్వాలని చేయి పట్టుకోవడంతో పాటు కోరిక తీరిస్తే సెల్ కొనిస్తానంటూ వేధించాడు. కామాంధుని బారి నుంచి తప్పించుకున్న ఆమె జరిగిన విషయాన్ని కుటుంబీకులకు చెప్పి విలపించింది. రాజకీయ అండదండలు కలిగిన వ్యక్తి తాను చేసిన నిర్వాకాన్ని బయటకు చెబితే అంతూ చూస్తానని ఆమెను బెదిరించడంతో బయటకు చెప్పుకోలేక పోయింది. చివరకు తమకు జరిగిన అవమాన భారాన్ని తట్టుకోలేని ఆ కుటుంబీకులు గురువారం ముచ్చుమర్రి పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు హేమసుందర్‌రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయశేఖర్ వెల్లడించారు. విషయం బయటకు పొక్కడంతో నాలుగు రోజుల క్రితమే నిందితుడు హైదరాబాద్‌కు పరారైనట్లు సమాచారం. నాలుగు గోడల మధ్య టీడీపీ నాయకుడు చేసిన ఆకృత్యం వెలుగు చూడకుండా మధ్యవర్తుల చేత రాజీ ప్రయత్నం చేసినట్లు సమాచారం. పొట్ట కూటికోసం పనికి వెళ్తే లైగింకంగా వేధించిన టీడీపీ నాయకుని నిర్వాకాన్ని గ్రామ ప్రజలు తప్పుబడుతున్నారు.

# పోలీస్ లాంఛనాలతో ఎస్‌ఐ వెంకటరమణ అంత్యక్రియలు



మర్తాడులో ఎస్‌ఐ వెంకటరమణ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్‌ఐ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

అనంతపురం/గార్లదిన్నె: అనంతపురం నగరానికి చెందిన ఎస్‌ఐ నంబూరి వెంకటరమణ(55) అంత్యక్రియలు గురువారం గార్లదిన్నె మండలంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి సర్కిల్ పరిధిలోని రాచర్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన... బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఆయనతో పాటు నూతన అల్లుడు పవన్ సాయి, డ్రైవర్ చంద్రశేఖర్ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం ఎస్‌ఐ వెంకటరమణ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గార్లదిన్నె మండలం మర్తాడులో తమ వ్యవసాయ క్షేత్రానికి తీసుకువచ్చారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి, డీఎస్పీ వెంకటశివారెడ్డి పాల్గొన్నారు. వెంకటరమణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న స్వగృహానికి చేరిన వెంకటరమణ మృతదేహాన్ని ఎస్పీ అన్బురాజన్, పోలీసు ఉన్నతాధికారులు, సహచరులు సందర్శించి అశ్రునయనాలతో నివాళులర్పించారు. పీటీసీ అదనపు ఎస్పీ జె.మల్లికార్జున వర్మ, అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, బ్యాచ్‌మేట్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జల చౌర్యానికి అడ్డుకట్ట



పైపులను తొలగించిన దృశ్యం


సాక్షి ఎఫెక్ట్

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు (తుండ్లవాగు) రిజర్వాయర్‌లో నుంచి కొనసాగుతున్న జలచౌర్యా నికి గురువారం అధికారులు అడ్డకట్ట వేశారు. కొందరు వ్యక్తులు పైపుల ద్వారా నీటిని తరలిస్తున్న విషయాన్ని 'సాక్షి'లో గురువారం 'యథేచ్ఛగా జలచౌర్యం' శీర్షికన కథనం ప్రసురితమైంది. దీంతో తెలుగుగంగ అధికారులు స్పందించారు. వెంటనే ఆ శాఖ డీఈ వెంకటరమణ సిబ్బందితో రిజర్వాయరు వద్దకు వెళ్లి పైపులను తొలగించారు. అలాగే గేటు అడుగు భాగాన ఉంచిన రాళ్లను తొలగించి గేటును పూర్తి కిందకు దించేశారు. అలాగే అక్కడే వదలి వెళ్లిన గొలుసులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు డీఈఈ తెలిపారు. రిజర్వాయర్ నుంచి అనుమతులు లేకుండా నీటిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఈ హెచ్చరించారు.

## నేడు శ్రీశైలంలో గిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: మాఘ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీశైలంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఈఓ పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. గిరి ప్రదక్షిణలో భక్తులు, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఈఓ సూచించారు.

## రాళ్లు.. నీళ్లు.. అందాలు!



కుందూనదిలో బయట పడిన పెద్ద పెద్ద బండ రాళ్లు



బయటపడిన గవ్వచిప్పలు, నీటిలో చెట్ల ప్రతిబింబాలు

నిన్నటి వరకు గల గల పారే నీటితో కళకళలాడిన కుందూనదిలో ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గిపోయి అడుగుభాగంలో ఉన్న పెద్ద పెద్ద బండ రాళ్లు బయటపడ్డాయి. కోవెలకుంట్ల, దొర్నిపాడు పరివాహక ప్రాంతాల్లో అడుగు భాగమంతా రాతి నేల కావడంతో ఎటు చూసినా బండరాళ్లే కనిస్తున్నాయి. ప్రకృతి చెక్కిన ఈ శిల్పాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అక్కడక్కడా పెద్ద గవ్వ చిప్పలు, నీటిలో చెట్ల ప్రతిబింబాలు, కొంగల చేపల వేట దృశ్యాలు నదికి మరింత అందాలను తెచ్చిపెట్టాయి.

– దొర్నిపాడు



# జగన్‌తోనే ఆర్టీసీకి పూర్వ వైభవం

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి



జెండా ఊపి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్, ఆర్ఎం రజియా సుల్తానా

నంద్యాల టౌన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే పూర్వ వైభవం వచ్చిందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక నంద్యాల ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు నంద్యాల – చెన్నై బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందన్నారు. ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించడమే కాకుండా సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా వారికి పెన్షన్ సౌకర్యాన్ని కూడా అందించిందన్నారు. పార్సిల్ డెలివరీ, స్లీపర్, ఏసీ సర్వీసుల ద్వారా ఆర్టీసీ ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. గతంలో నంద్యాల – చెన్నై సర్వీసును సరైన ఆక్యూపెన్సీ లేక రద్దు చేశారని, విద్యార్థులు, ఉద్యోగుల వినతులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సర్వీసు మంజూరు చేశారన్నారు. ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా మాట్లాడుతూ నంద్యాలలో రాత్రి బయలుదేరి ఉదయానికి చెన్నై చేరుకునే విధంగా బస్సు నడపడం వల్ల విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో వెసులుబాటుగా ఉంటుందన్నారు. ఆర్ఎం రజియా సుల్తానా మాట్లాడుతూ నంద్యాల చెన్నై సూపర్ లగ్జరీ సర్వీసు రాత్రి 9 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.45 గంటలకు చెన్నై చేరుకుంటుందని, అలాగే అదే రోజు రాత్రి 8 గంటలకు చెన్నైలో బయలు దేరి, మరుసటి రోజు ఉదయం నంద్యాల చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసు టికెట్లను ఆన్‌లైన్, రిజర్వేషన్ కౌంటర్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు. నంద్యాల జిల్లా ప్రజలు ఈ సర్వీసు వినియోగించుకోవాలని, ప్రయాణికుల నుండి మంచి స్పందన వస్తే చెన్నైకి మరిన్ని సర్వీసులు నడుపుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇషాక్ జెండా ఊపి బస్సు సర్వీసు ప్రారంభించారు. ఎమ్మెల్యే శిల్పా రవి బస్సును నడిపి ఆర్టీసి డ్రైవర్లలో ఉత్సాహం నింపారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, అసిస్టెంట్ విజయ్, అధికారులు ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

## 71 రోజులు.. రూ. 77 లక్షలు



మహానందిలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామికి హుండీ కానుకల ద్వారా భారీ ఆదాయం లభించింది. మహానందిలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 77, 64, 241 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అభిషేక మండపంలో గురువారం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి, కోదండరామాలయం, వినాయకనంది ఆలయాలతో పాటు అన్నదానం విభాగం, గో సంరక్షణ విభాగంలోని హుండీ కానుకలు లెక్కించారు. ఈ మేరకు ఆలయాల ద్వారా రూ. 75,97,586, అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 1,27,229, గో సంరక్షణ విభాగం ద్వారా రూ. 39,426 కలిపి మొత్తం 71 రోజులకు రూ. 77, 64, 241 వచ్చినట్లు చెప్పారు. వీటితో పాటు యూఎస్ఏ, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన కరెన్సీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.